

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
గురువారం 4 జనవరి 2024

ప్రజాపాలనకు 48,696 దరఖాస్తులు 8లో..
మల్లన్న జాతరకు పోటెత్తిన భక్తులు 7లో..

- ఈ యేడాది రాజకీయ నాయకులకు, విద్యార్థులకు, ఉద్యోగార్థులకు కీలకం
- వరసగా జరగనున్న పార్లమెంట్, పంచాయతీ, పరిషత్, మున్సిపల్ సహకార సంఘాల ఎన్నికలు
- ఇప్పటికే విడుదలైన పదో తరగతి, ఇంటర్ టైం టేబుల్స్
- మెగా డీఎస్సీపై పెరుగుతున్న ఆశలు.. ఖరారైన టెట్ తేదీలు ● అన్ని వర్గాలకు 'కీలక' నామ సంవత్సరమే



అందరికీ పరీక్షే

జగిత్యాల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రాజకీయ పక్షాలు.. రాజకీయ నాయకులు.. విద్యార్థులు.. నిరుద్యోగులు.. ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజలకు ప్రస్తుత యేడాది పరీక్షా సమయంగా మారనుంది. ప్రస్తు త సంవత్సరంలోనే పార్లమెంట్ ఎన్నికలతో పాటు గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లాపరిషత్, మున్సిపల్, సహకార సంఘాల ఎన్నికలు జరగనుండడం అటు పార్టీలు, రాజకీయ నాయకులతో పాటు సమర్థవంతంగా ఎన్నికలను నిర్వహించడం ఉద్యోగులకు పరీక్షగా తయారుకానున్నాయి. వీటితో పాటు కొత్త ఆశలు, కొంగొత్త ఆశయాలతో ఉన్న నిరుద్యోగ యువత ఈ యేడాది ప్రభుత్వం చేపట్టనున్న ఖాళీల భర్తీ, మెగా డీఎస్సీ, టెట్ వంటి పోటీ పరీక్షల సవాళ్లను ఎదుర్కోవలసి ఉంటుంది. దీనికి తోడు ప్రతీ యేటా నిర్వహించే పదో తరగతి, ఇంటర్ తదితర వార్షిక పరీక్షల టైం టేబుల్స్‌ను ఆయా బోర్డులు ఇప్పటికే ప్రకటించాయి. పరీక్షలు ప్రతీ యేటా జరిగే తంతు అయినప్పటికీ ప్రస్తుత యేడాది అటు ఎన్నికలు, ఇటు పరీక్షలు ఎదుర్కొంటుండడం ప్రాధాన్యాన్ని సంతరించుకొంది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఆయా వర్గాల వ్యక్తులు ఆయా పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారు.

ముంచుకొస్తున్న ఎన్నికలు...

కొత్త సంవత్సరం వచ్చేసింది. 2024 సంవత్సరంలో లోక్‌సభకు మొదలుకొని గ్రామపంచాయతీ, మండల, జిల్లా ప్రజాపరిషత్‌లతో పాటు సహకార, పురపాలక సంఘాలకు ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ప్రధాన రాజకీయ పక్షాలకు, రాజకీయ పార్టీల నాయకులకు వివిధ వర్గాల ప్రజలకు కీలక నామ సంవత్సరంగా మారనుంది. కొత్త ఏడాదిలో ఏప్రిల్-మే నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికలను రాజకీయ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఒకటి కాంగ్రెస్, రెండు బీఆర్ఎస్ గెలిచాయి. లోకసభ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రధాన పార్టీలు ఇప్పటికే సమాయత్తం అవుతున్నాయి. గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ఈనెలాఖరుతో ముగియనుంది.

ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అంతర్గత కసరత్తు ప్రారంభించింది. సార్వత్రిక సమరం తర్వాత వీటిని నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇవి ముగిసిన మూడు నెలల్లో మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఆ తర్వాత పురపాలక, సహకార సంఘాల ఎన్నికల నోటిఫికేషన్లు విడుదలయ్యే అవకాశాలు న్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలంటే గ్రామ, మండల, జిల్లా రాజకీయ పార్టీల నేతల హడావుడి ఉంటుంది. అధికార కాంగ్రెస్ పార్టీకి ధీటుగా బరిలో నిలిచేందుకు బీఆర్ఎస్, బీజేపీలతో పాటు బీఎస్పీ, సీపీఎం, సీపీఐ, ఎంఐఎం తదితర పార్టీలు స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి.

మెగా డీఎస్సీ, ఖాళీల భర్తీపై పెరుగుతున్న ఆశలు..

నూతన ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేస్తోంది. దీంతో ఈ సంవత్సరం ఉద్యోగార్థులకు కీలకంగా మారనుంది. వాయిదా పడిన గ్రూప్ పరీక్షలను నిర్వహించడంతో పాటు మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే రెండుసార్లు గ్రూప్-1 ప్రిలిమ్స్ రాసిన ఉద్యోగార్థులు మూడోసారి పరీక్ష రాయాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. దీంతో నిరుద్యోగులు మరోమారు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఈ ఏడాదిలో అభ్యర్థులు ఉద్యోగ సాధనలో క్షణం వృథా చేయకుండా సన్నద్ధం కావాల్సిన అవసరం ఉంది. మెగా డీఎస్సీ నిర్వహణపై నిరుద్యోగులు ఆశలు పెంచుకుంటున్నారు.

జగిత్యాల జిల్లాలో ఎన్నికల ముందు టీఆర్‌టీ కోసం ప్రకటించిన పోస్టులు 148 ఉన్నాయి. ఇందులో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 50, సెకండరీ గ్రేడ్ టీచర్స్ పోస్టులు 53, భాషా పండితులు 37, క్రీడోపాధ్యాయులు ఎనిమిది పోస్టులు ఉన్నాయి. పలువురి ఉద్యోగ విరమణతో మరిన్ని పోస్టులు ఖాళీ అయ్యే అవకాశాలున్నాయి. రాష్ట్రంలో ఎక్కడా బడిలేని ఊరు ఉండవద్దని, మూతపడిన పాఠశాలలను తెరిపించాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దీంతో పలు పోస్టులు పెరిగే అవకాశాలున్నాయి. టెట్ అర్హతతోనే పదోన్నతులు కల్పించాలనే నిబంధన అమలైతే అదనంగా ఎస్‌జీటీ పోస్టుల ఖాళీలు పెరుగుతాయని ఆశిస్తున్నారు.

టెట్‌కు సన్నద్ధం...

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహణకు విద్యాశాఖ సన్నాహాలు చేస్తుండడంతో అందుకు అనుగుణంగా ఆశావహులు సన్నద్ధం అవుతున్నారు. ఈ యేడాది ఏప్రిల్ నెలలో టెట్ నిర్వహించే అవకాశాలున్నాయన్న ప్రచారంతో ఇప్పటి నుంచే పలువురు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడానికి టెట్ అర్హత అనివార్యమవుతోందని అధికారులు అంటున్నారు. దీంతో వీలైనంత త్వరగా టెట్ నిర్వహించడానికి సర్కారు యత్నిస్తోంది.

సుప్రీంకోర్టు సైతం ఉపాధ్యాయుల పదోన్నతులలో టెట్ తప్పనిసరని తేల్చడంతో సుమారు యేడాది కాలంగా పదోన్నతుల ప్రక్రియ నిలిచిపోయింది. టెట్ నిర్వహిస్తే జిల్లాలోని సుమారు ఆరు వేల మంది ఉపాధ్యాయులు హాజరయ్యే అవకాశాలున్నాయి. రాష్ట్రంలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని కాంగ్రెస్ ఎన్నికల మెనిఫెస్టోలో హామీ ఇచ్చింది. ఇప్పటివరకు బీఈడీ, డీఈడీ తదితర అర్హతలను కలిగిన వారు సైతం టెట్ పరీక్షకు హాజరవుతారు. కాగా సర్వీసులో ఉన్న వారికి డిపార్ట్‌మెంట్ పరీక్ష మాదిరిగా ప్రత్యేకంగా టెట్ నిర్వహించాలన్న డిమాండ్ సైతం ఉపాధ్యాయ వర్గాల నుంచి వినిపిస్తోంది. ఇలా ప్రస్తుత కొత్త యేడాది పలు వర్గాల వ్యక్తులకు పరీక్షా కాలంగా మారనుంది.

సీఎం, మంత్రులను కలిసిన ప్రభుత్వ విప్



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి

ధర్మపురి, జనవరి 3: నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులను కలిసి ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బుధవారం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో సీఎం సహా రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గ పరిధిలో నెలకొన్న సమస్యలు గురించి వారికి ఆయన వారి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే జనవరి 18 నుంచి 24వరకు జరిగే ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామి వారి వేదపారాయణం, వేదహోవనం కార్యక్రమాల నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి, ముగ్గురు మంత్రులు నియోజకవర్గపరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి, అభివృద్ధి కోసం పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు లక్ష్మణ్‌కుమార్ తెలిపారు.

ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలి

- కలెక్టర్‌ను కలిసి విన్నవించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ

జగిత్యాల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని కోరుతూ కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాకు ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ షేక్‌యాస్మిన్ బాషను బుధవారం కలిసి పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ రంగంలో ఇసుక ప్రాధాన్యాన్ని వివరించారు. ఇసుకను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు జిల్లా కేంద్రంలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని సూచించారు. గతంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఇసుక స్టాక్ పాయింట్‌ను సంవత్సర కాలంగా నిలిపివేయడంతో భవన నిర్మాణ రంగానికి అవసరమైన ఇసుక అందుబాటులో ఉండడం లేదన్నారు. దీంతో ప్రైవేటుగా ఇసుకను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. గతంలో నిర్వహించిన ఇసుక స్టాక్ పాయింట్‌ను తిరిగి ప్రారంభిస్తే భవన నిర్మాణాలు చేపట్టే వారిపై అదనపు ఆర్థిక బారం తప్పుతుందన్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టే వీలుంటుందన్నారు. ఇందుకు జగిత్యాల పట్టణంలో రాజరాజేశ్వరస్వామి ఆలయానికి చెందిన సుమారు అయిదెకరాల స్థలాన్ని పరిశీలించాలని సూచించారు. అధికారులు ఇసుక స్టాక్ పాయింట్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్‌ను కలిసిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్



కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ బుధవారం కలిశారు. నూతన సంవత్సరం సందర్భంగా మర్యాదపూర్వకంగా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాను కలిసి పూలమొక్కను అందించారు. పలు అభివృద్ధి, సంక్షేమ అంశాలపై చర్చించారు. పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సఖి సెంటర్ సేవలు అభినందనీయం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఏఎస్ ఆశిష్, అధికారులు

జగిత్యాల అర్బన్, జనవరి 3: బాధిత మహిళల, పిల్లల సంక్షేమం కోసం చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలు, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సఖి సెంటర్ సేవలు అభినందనీయం అని ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల వ్యయ పరిశీలకులుగా వ్యవహరించిన ఐఏఎస్ షిల్ ఆశిష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్‌లో గల సఖి కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత మహిళల కోసం చేపడుతున్న కార్యక్రమాలు, గ్రామగ్రామాన చేస్తున్న అవగాహన కార్యక్రమాలపై అడిగి తెలుసుకున్నారు. సఖి కేంద్రం ద్వారా బాధిత మహిళల పరిస్థితులు తెలుసుకొని, వారిని కౌన్సెలింగ్ చేస్తూ కుటుంబపరంగా వారిని ఒక్కటిగా చేర్చి మార్గదర్శనం చేస్తున్న సఖి కేంద్రం సేవలు ప్రశంసనీయం అన్నారు. అనంతరం చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి హరీష్, బాలల సంరక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమాలు, వారి రక్షణ తదితర అంశాలపై చేసిన కార్యక్రమాలను అడిగి తెలుసుకొని అభినందించారు. కార్యక్రమాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని, ఆయా కార్యక్రమాలను ఎప్పటికప్పుడు డిజిటలైజేషన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీబ్ల్యూవో ఆడెపు భాస్కర్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు శ్రీనివాస్, సఖి అడ్మిన్ మనీలా, కోఆర్డినేటర్ శారద, సిబ్బంది పాల్గొన్నారు.

సింగిల్ విండో చైర్మన్‌పై అవిశ్వాసం

కథలాపూర్, జనవరి 3: మండలంలోని సిరికొండ సింగిల్ విండో చైర్మన్ చుక్క దేవరాజంపై డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటించారు. విండోలోని 10 మంది డైరెక్టర్లు దేవరాజంపై అవిశ్వాసం ప్రకటించి జిల్లా కో ఆపరేటివ్ అధికారికి తీర్మాన పత్రాన్ని బుధవారం అందించారు. 10 మంది సంతకాలతో కూడిన తీర్మాన పత్రాన్ని జిల్లా అధికారికి అందించినట్లు డైరెక్టర్లు తెలిపారు. కాగా దేవరాజం బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో గెలిచారు. అయితే ఇప్పుడు బీజేపీ, బీఆర్ఎస్ డైరెక్టర్లు కలిపి అవిశ్వాసం ప్రవేశపెట్టడం చర్చనీయాశంగా మారింది.



అవిశ్వాసం నోటీసు అందిస్తున్న డైరెక్టర్లు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్సై సందీప్

బుగ్గారం, జనవరి 3: సైబర్ నేరాలపై ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సందీప్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సోషల్ మీడియాను పిల్లలు ఎక్కువ వాడుతుండడంతో వాటిని వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సైబర్ నేరాలపై నేర్చుకున్న విషయాల్ని ప్రతి ఒక్కరు ఇతరులకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు సైతం సైబర్ నేరాల నియంత్రణలో తమ వంతు పాత్ర పోషించాలని కోరారు. ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్న నైపథ్యంలో సైబర్ నేరాలపై అందరు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు రవిప్రసాద్, లచ్చయ్య, సత్యనారాయణ, ఆశోక్, రత్నం, వేణు, సీఆర్‌పీ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

చెగ్యాం బస్సు పునరుద్ధరించాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అక్రం మాలిక్



డీఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న అక్రం

వెల్గటూర్, జనవరి 3: జగిత్యాల నుంచి చెగ్యాం వరకు తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అక్రం మాలిక్ జగిత్యాల డిపో మేనేజర్ సునితకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. గతంలో జగిత్యాల నుంచి చెగ్యాం వరకు మూడు ట్రిప్పులు బస్సు నడిచేదని ప్రస్తుతం బస్సు నడవకపోవడంతో గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. జగిత్యాల నుంచి గొల్లపల్లి, అబ్బాపూర్, వెల్గటూర్, ముత్తనూర్ మీదుగా బస్సునడపాలని కోరారు. కాగా వారంచ రోజుల తరువాత సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని డీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ సభ్యులు రాహుల్, సంజయ్, నాగరాజు, రోహిత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బీర్‌పూర్ ఘాట్‌రోడ్డుపై ఇరుక్కుపోయిన బస్సులు

బీర్‌పూర్,జనవరి 3: బీర్‌పూర్ ఘాటు రోడ్డుపై రెండు బస్సులు బుధవారం ఇరుక్కుపోయాయి. జగిత్యాల నుంచి బీర్‌పూర్ వైపు ఓ ప్రైవేట్ బస్ వెళుతుండగా కడెం నుంచి జగిత్యాలకు వెళ్లే పల్లెవెలుగు బస్సు ఎదురుగా వచ్చింది. ఆ ప్రాంతంలో రోడ్డు ఇరుకుగా ఉంది. సీసీ రోడ్డుకు ఇరు పక్కలా బస్సులు దింపుకునేందుకు స్థలం లేక పోవడంతో ఏ బస్సు ఎటు వైపు వెళ్లాలి అనేది అర్థం కాక అర గంట పాటుగా డ్రైవర్లు నానా తంటాలు పడ్డారు. ప్రైవేట్ బస్సు గుట్ట దిగుతుండడం, ఆర్టీసీ బస్సు గుట్ట ఎక్కుతుండగా నిలిచిపోయాయి. ఏ మాత్రం తేడా వచ్చినా బస్సులు లోయలో పడే ప్రమాదం ఉంది. అరగంటపాటు ప్రయత్నించిన తర్వాత బస్సులు వెళ్లాయి. తమ ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని ఉన్నామని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి రోడ్డు వెడెల్పు చేయాలని కోరారు.



ఘాట్‌రోడ్డుపై నిలిచిపోయిన బస్సులు

టెట్‌తో సంబంధం లేకుండా పదోన్నతులు కల్పించాలి



సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

మెట్‌పల్లి, జనవరి 3: టెట్‌తో సంబంధం లేకుండా పదోతన్నతులు కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవోకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐక్యవేదిక కన్వీనర్ తులసి ఆగమయ్య, కోకన్వీనర్లు అంకతి లింగారెడ్డి, జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు శ్యామ్‌సుందర్, నాయకులు లావుద్య రాజు, జరుపుల సుధాకర్, వహిద్, విజయబాస్కర్, పులి రమేష్, రవిబాబు, సరిత, ప్రమీల పాల్గొన్నారు.

కోరుట్లలో నమ్మాళ్‌వార్ పరమపదోత్సవం



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

కోరుట్ల, జనవరి 3: పట్టణంలోని పురాతన వేంకటేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా నమ్మాళ్‌వార్ పరమ పదోత్సవాన్ని బుధ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుడు బీర్నంది నర్సింహా చారి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అర్చన అభిషేకాలను నిర్వహించారు. మనిషి మరణించిన తరువాత జరిగే విషయాలను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో విక్రం, సిబ్బంది నర్సయ్యతోపాటు అర్చకులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానా సేవలను వినియోగించుకోవాలి



పల్లె దవాఖానాను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

రాయికల్, జనవరి 3: పల్లె దవాఖానాలో సేవలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పి శ్రీధర్ అన్నారు. మండలంలోని కట్కాపూర్ పల్లె దవాఖానాను కేంద్ర నాణ్యత ప్రమాణాల బృందం సభ్యులు ఎస్ శ్రీలక్ష్మి, ప్రేమాన్షు బుధవారం సందర్శించారు. పల్లె దవాఖానాలో అందించే ఆరోగ్య సేవలను పరిశీలించారు. కిశోర బాలికలకు అందించే సేవలు, కుటుంబ నియంత్రణ, పుట్టిన పిల్లలకు అందించే సేవలు, అంటు వ్యాధుల నియంత్రణ, సాధారణ వ్యాధుల నియంత్రణ, సాధారణ వ్యాధుల నియంత్రణ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉప వైద్యాధాకారి శ్రీనివాస్, సర్పంచ్ రాజమౌళి, మెడికల్ ఆఫీసర్ కస్తూరి సతీష్, అంజిత్ రెడ్డి, డీపీవో స్వామి, నేషనల్ క్వాలిటీ మేనేజర్ నాగరాజు, హెచ్ఈవో శ్రీనివాస్, సూపర్‌వైజర్ శ్రీధర్, సీహెచ్‌వో ప్రమీళ, ఎంఎల్‌హెచ్‌పి శ్రీధర్, రాహుల్, ఝాన్సీ ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, లలిత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎల్లారెడ్డిపేట, జనవరి 3: ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామ శివారులో పట్టుకున్నామని ఎస్ఐ రమాకాంత్ బుధవారం తెలిపారు. అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నారనే సమాచారంతో స్టేషన్ హౌస్ అధికారులు రవీందర్‌రెడ్డి, సత్యనారాయణ హరిదాస్‌నగర్ గ్రామ శివారులోని వాహన తనిఖీలు నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసునకు తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను వారు పట్టుకున్నారని తెలిపారు .ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి వాహన డ్రైవర్లు గడ్డం భార్గవ్, పులి కిషన్, కూడలి అశోక్‌తో పాటు యజమానులపై కేసు నమోదు చేశామని చెప్పారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రమాకాంత్ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెగడపల్లి, జనవరి 3: మండలంలోని బతికెపల్లి గ్రామానికి చెందిన క్యాస సంజీవ్ (37) అనే వ్యక్తి మంగళవారం రాత్రి గ్రామశివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సంజీవ్ గ్రామం నుంచి జగిత్యాల వెళ్తుండగా బతికెపల్లి శివారులో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. దీంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బావమరిది మల్లయ్య ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీహెచ్ సతీష్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, జనవరి 3: చదువుకొమ్మని తల్లిదండ్రులు మందలించారని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలంలోని గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన పాపినేని శివమణి(19) ఇంటర్ చదువుతున్నాడు. మంచిగా చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించడంతో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో శివమణి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ మహేందర్ తెలిపారు.

బొట్లవనపర్తిలో ఒకరి హత్య

ధర్మారం, జనవరి 3: మండలంలోని బొట్లవనపర్తి గ్రామానికి చెందిన వాలుక మల్లేష్(45)అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. పెద్దపల్లి సీఐ అనిల్ కుమార్ కథనం ప్రకారం.. బొట్లవనపర్తి గ్రామానికి చెందిన వాలుక మల్లేష్ మంగళవారం తెల్లవారుజాము 2గంటల సమయంలో బయటకు వెళ్లాడు. అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలించారు. బుధవారం ఉదయం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో మల్లేష్ మృతదేహం పడి ఉంది. మృతదేహాన్ని బయటకు తీసి చూడగా అతని గొంతు, కడుపు భాగంలో పదునైన ఆయుధంతో కోసి చంపినట్టుగా ఉంది. మృతునికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. మల్లేష్ ప్రతి రోజు పెద్దపల్లిలో భవన నిర్మాణ పనికి వెళ్తుంటాడు. తన భర్తను అదే గ్రామానికి చెందిన అకారి అంజయ్య హత్య చేసినట్టు అనుమానంగా ఉందని భార్య రజిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ అనిల్‌కుమార్ తెలిపారు. సంఘటన స్థలాన్ని సీఐ పరిశీలించారు. ఆయన వెంట ధర్మారం ఎస్సై సత్యనారాయణ ఉన్నారు.

హాస్టల్ విద్యార్థులపై దాడి : నిందితుల రిమాండ్

కరీంనగర్ క్రైం, జనవరి 3: కరీంనగర్‌లోని రాంనగర్ ఎస్సీ హాస్టల్ విద్యార్థులను కర్రలు, రాళ్లతో కొట్టిన నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని రెండో ఠాణా పోలీసులు తెలిపారు. డిసెంబరు 31న రాంనగర్ హాస్టల్ వద్ద జరిగిన గొడవను దృష్టిలో పెట్టుకుని మంగళవారం రాత్రి 11:30 గంటలకు రాంనగర్‌కు చెందిన సాయిరాం, నాగరాజు, అరుణ్, సిద్ధార్థ, మధు, రవిప్రసాద్, శ్రీధర్, ఈశ్వర్, పవన్‌లు రాంనగర్ ఎస్సీ హాస్టల్‌లోకి అక్రమంగా ప్రవేశించి విద్యార్థులు వేల్పుల మధు, మరికొంత మంది విద్యార్థులను కర్రలు, రాళ్లతో కొట్టారు. ఇదే సమయంలో వాచ్‌మన్ అడ్డురాగా అతడి తలపై కర్రలతో కొట్టారు. ఈ మేరకు బాధితుడు వేల్పుల మధు ఫిర్యాదుతో 9 మంది నిందితులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

ఇడ్లీ బండిని ఢీకొట్టిన లారీ

● పలువురికి స్వల్ప గాయాలు ● తప్పిన ప్రమాదం


ఇడ్లీ బండికి ఢీకొట్టి బోల్తాపడిన లారీ

సిరిసిల్ల క్రైం, జనవరి 3: సిరిసిల్ల-కరీంనగర్ ప్రధాన రహదారిలో రగుడు ఎల్లమ్మ ఆలయం వద్ద బుధవారం ఉదయం అతివేగంగా వచ్చిన ఓ లారీ అదుపుతప్పి ఇడ్లీ బండిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇడ్లీ బండి ఎగిరిపడడంతో సామగ్రి చెల్లాచెదురైంది. అప్పటికే ప్రమాదాన్ని గుర్తించిన చిరువ్యాపారితో సహా అక్కడ టిఫిన్ చేస్తున్న వారంతా పరుగెత్తారు. అయినప్పటికీ పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఇడ్లీ బండికి ఢీకొట్టిన లారీ రోడ్డుపై పల్టీలు కొట్టింది. లారీ నుజ్జునుజ్జయ్యింది. గాయాలపాలైన క్షతగాత్రులను చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.

7న ఉమ్మడి జిల్లా సీనియర్ ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 3: జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి సీనియర్ మహిళలు, పురుషుల ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలను ఈ నెల 7న నిర్వహించనున్నారు. కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 10 గంటల నుంచి ఈ ఎంపిక పోటీలను నిర్వహించనున్నామని జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నటరాజ్ రవి, వై మహేందర్‌రావులు తెలిపారు. ప్రతిభచాటే క్రీడాకారులను ఈనెల చివరి వారంలో నల్గొండ జిల్లా భువనగిరిలో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్స్ ఖో-ఖో పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్లకు ఎంపిక చేయనున్నామని వారు పేర్కొన్నారు. కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల క్రీడాకారులు పోటీల్లో పాల్గొనుటకు అర్హులని పేర్కొన్నారు. క్రీడాకారులు ఆధార్‌కార్డు జిరాక్స్‌తో ఉదయం 10 గంటలకు అంబేదక్కర్ స్టేడియంలో రిపోర్టు చేయాలని వారు సూచించారు.

అయోధ్య రామాలయం పేరిట డబ్బుల వసూళ్లు

● పోలీసులకు అప్పగించిన స్థానికులు

● రామాలయం పేరు చెపితే డబ్బులు ఇవ్వకండి : పోలీసులు

హుజూరాబాద్, జనవరి 3: హుజూరాబాద్ పట్టణంలోని సూపర్‌బజార్ రోడ్‌లో కొందరు అర్చకులుగా చెప్పి అయోధ్య రామాలయం పేరిట ఇంటింటికీ తిరుగుతూ డబ్బులు వసూలు చేస్తుండగా స్థానికులు బుధవారం అడ్డుకున్నారు. ఈ విషయాన్ని స్థానికులు బీజేపీ నాయకుల దృష్టికి తీసుకెళ్లగా, హుటాహుటిన వారి వద్దకు బీజేపీ పట్టణాధ్యక్షుడు గంగిశెట్టి రాజు వచ్చి వారిని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఐదుగురు అర్చకులుగా చెప్పుకుంటున్నారని గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి అదుపులోకి తీసుకున్నారు. రామాలయం పేరు మీద డబ్బులు వసూళ్లు చేయవద్దని హెచ్చరించారు. ఈ సందర్భంగా గంగిశెట్టి రాజు మాట్లాడుతూ అయోధ్య రామాలయం పేరు మీద ఎవరైనా డబ్బులు అడిగితే రూపాయి కూడా ఇవ్వవద్దన్నారు.

రజనీశ్రీ రాష్ట్రస్థాయి సాహిత్య పురస్కారానికి నవలల ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, జనవరి 3: జాతీయ సాహిత్య పరిషత్ ద్వారా అందించే నటుడు, కవి, నాటక రచయిత, నాట్యాచార్యుడు రజనీశ్రీ రాష్ట్రస్థాయి సాహిత్య పురస్కారానికి నవలలను ఆహ్వానిస్తున్నట్లు పురస్కార కమిటీ కన్వీనర్, పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్, జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు గాజుల రవీందర్, నంది శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పురస్కారం కింద ప్రశంసాపత్రం, 10,116 రూపాయల నగదు అందిస్తామని పేర్కొన్నారు. సొంతగా రచించిన నవలలు మాత్రమే పంపాలని, అనువాద నవలలు పోటీకి స్వీకరించబడవని తెలిపారు. జనవరి 1, 2014 నుంచి డిసెంబరు 31, 2023 లోపు ముద్రించిన నవలలను ప్రతీ టైటిల్స్ నాలుగు ప్రతులను పంపాలని కోరారు. ఫిబ్రవరి 10వ తేదీ లోపు గాజుల రవీందర్, ఇంటి నెంబరు 8-3-255/1, రామచంద్రాపూర్‌కాలని, రోడ్ నెం. 12, భగత్‌నగర్, కరీంనగర్-505001 చిరునామాకు నవలలను పంపాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9848255525 లేదా 9490401861 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

మల్లన్న జాతరకు పోటెత్తిన భక్తజనం

● స్వామివారికి బోనాలు సమర్పించిన భక్తులు


ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

గొల్లపల్లి, జనవరి 3: గొల్లపల్లి మండలం మల్లన్నపేటలో జరుగుతున్న మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు భక్తుల కొంగు బంగారంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులతో బుధవారం జాతర పోటెత్తింది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా బెల్లం పానకంతో వండిన బోనాలను భక్తులు నెత్తిన ఎత్తుకుని ఒగ్గు పూజారుల ఢమరుక నాదాల నడుమ ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేశారు. శివసత్తుల పూనకాలు, భక్తుల మల్లన్న నామస్మరణలతో ఆలయ పరిసర ప్రదేశాలు మార్మోగాయి. మల్లన్న స్వామికి బోనాలు సమర్పించి తమ ఇష్టదైవానికి ప్రీతిపాత్రమైన పసుపు బెల్లం, బంతి పూలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గర్భగుడి ఎదుట భక్తులు క్యూలైన్‌లో బారులు తీరి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కొందరు భక్తులు తమ పిల్లలకు పుట్టు వెంట్రుకలు తీయించగా, మరికొందరు భక్తులు మల్లన్న స్వామికి ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో పట్నాలు వేయించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తమ కుల దైవానికి నిలువెత్తు నల్ల బంగారం (బెల్లం) తులాభారం వేయించి భక్తులకు పంచిపెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధంకి నర్సయ్య, ఉప సర్పంచ్ బేర కిశోర్, ఎంపీటీసీ గోస్కుల రాజన్న, సిద్ధంకి మల్లయ్య పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

కోల్‌సిటీ, జనవరి 3: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరికి బుధవారం గోదావరిఖని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు రెండవ అదనపు న్యాయమూర్తి దుర్గం వెంకటేష్ ఐదు రోజుల జైలు శిక్ష విధించినట్టు రామగుండం ట్రాఫిక్ సీఐ టీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరు మద్యం సేవించి పట్టుబడ్డారని, వారిని కోర్టులో ప్రవేశపెట్టగా ఐదు రోజుల జైలుశిక్ష విధించారని చెప్పారు.

రూ.6,750 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జనవరి 3: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,750 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 76మంది రైతులు 682 క్వింటాళ్ల విడిపత్తి, నలుగురు రైతులు 13క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు.

ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.6750, కనిష్ఠ ధర రూ.5,400 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

పురుగు మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి

కాల్వశ్రీరాంపూర్, జనవరి 3: అనారోగ్యంతో బాధపడుతూ పురుగుల మందు తాగిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం.. కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన కన్నూరి రామకృష్ణ(22) గత కొన్ని రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో రామకృష్ణ జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంట్లో పురుగుల మందు తాగాడు.

గమనించిన కుటుంబ సభ్యులు రామకృష్ణను కరీంనగర్‌కు తరలించగా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. రామకృష్ణ తల్లిదండ్రులు విజయ్, లలితల ఏకైక కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో వారి రోదనలు మిన్నంటాయి. రామకృష్ణ తండ్రి విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

వైన్స్‌షాప్‌లో చోరీ కేసులో నిందితుల పట్టివేత

● ఆటో, రూ.98వేలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై

రామగిరి, జనవరి 3: మండలంలోని లద్నాపూర్ గ్రామంలోని మహాలక్ష్మి వైన్స్ షాప్‌లో చోరీకి పాల్పడిన నిందితులను పోలీసులు బుధువారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు బుధవారం రామగిరి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సతీష్ ఆధ్వర్యంలో ఎస్ఐ రవీప్రసాద్ వివరాలను వెల్లడించారు. మండలంలోని లద్నాపూర్ వద్ద గల వైన్స్ షాప్‌లో మంగళవారం రాత్రి పెద్దపల్లికి చెందిన వ్యాపారి సయ్యద్ షఫీ ఉద్దీన్, మరో బాలుడు అర్ధరాత్రి షటర్ తాళం పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. క్యాష్ కౌంటర్‌లో గల రూ.98 వేలు ఎత్తుకెళ్లారు. బుధవారం వైన్స్ యాజమాని ఫిర్యాదు మేరకు నిందితుల కోసం ప్రత్యేక టీంలు గాలింపు చేపట్టారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించి నిందితులు ఉపయోగించిన ఆటో గుర్తించారు. సదరు నిందితులు తిరిగి మంథని వైపు వెళ్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు పన్నూరు క్రాస్‌రోడ్‌లో వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా ఉన్న నిందితులను పట్టుకొని విచారించడంతో నేరం అంగీకరించినట్లు ఎస్ఐ తెలిపారు. వారి వద్ద రూ.98 వేల నగదుతోపాటు ఆటోను స్వాధీనం చేసుకుని వారిద్దరినీ రిమాండ్ తరలించినట్లు పేర్కొన్నారు. చోరీ కేసును ఛేదించిన ఎస్ఐ రవీప్రసాద్, పోలీసులను మంథని సీఐ సతీష్ అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులతో పీఈటీ

మానకొండూర్, జనవరి 3 : మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలో గల కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఎనిమిదో తరగతి చదువుతున్న రమాదేవి అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూర్ క్రీడా ప్రాంగణంలో బుధవారం జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా ఎంపిక పోటీలు జరిగాయి. నాలుగు జిల్లాల నుంచి పలువురు క్రీడాకారులు హాజరు కాగా ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనభ కనబరిచిన రమాదేవి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 6,7,8 తేదీలలో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలల్లో పాల్గొననుంది. రమాదేవి ఎంపిక పట్ల పాఠశాల ప్రత్యేక అధికారి స్వప్న, వ్యాయామ ఉపాధ్యాయురాలు కోమలత, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

వెల్గటూర్‌లో...

వెల్గటూర్: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ హ్యాండ్ బాల్ పోటీలకు చెగ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ అశోక్ తెలిపారు. గుల్లకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 17 బాల, బాలికల విభాగంలో చెగ్యాం పాఠశాల విద్యార్థులు రాంచరణ్, వైష్ణవి, రిషిత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు. కాగా విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, ఎస్ఎంసీ చైర్మన్ రాజయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

రాజన్న సేవలో ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

వేములవాడ, జనవరి 3: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించారు. ఆలయ ప్రొటోకాల్ సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు స్వామి వారి ప్రసాదం అందజేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాజన్న ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. వేములవాడ రాజన్నను దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.



ఎమ్మెల్సీకి ప్రసాదం అందజేస్తున్న సూపరింటెండెంట్ శ్రీరాములు

ఎస్‌యూ డిగ్రీ పరీక్షల్లో 1,931 మంది గైర్హాజరు

గణేశ్‌నగర్, జనవరి 3: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం 1,931 మంది గైర్హాజరైనట్లు యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. మొదటి సెమిస్టర్ పరీక్షలకు 13,526 మంది విద్యార్థులు హాజరు కాగా 1397 మంది గైర్హాజరయ్యారన్నారు. మూడో సెమిస్టర్ పరీక్షలకు 12,803 మంది హాజరు కాగా 534 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గంగాధర, జనవరి 3: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వుల్ల అభిలాష్ తెలిపారు. నాగిరెడ్డిపూర్ వాగునుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రాత్రికి రాత్రే ఆలయానికి అడ్డుగా గోడ నిర్మాణం

● పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు


మెట్‌పల్లిలోని త్రిశక్తి ఆలయానికి అడ్డుగా నిర్మించిన గోడ

మెట్‌పల్లి, జనవరి 3: పట్టణంలోని త్రిశక్తి ఆలయం ముఖద్వారానికి అడ్డుగా గుర్తు తెలియని వ్యక్తులు రాత్రికి రాత్రే గోడ నిర్మాణం చేశారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ సమీపంలోని త్రిశక్తి ఆలయం తూర్పు దిక్కున ఉన్న గేటుకు అడ్డుగా గుర్తు తెలియని వ్యక్తులు రాత్రికి రాత్రే అక్రమంగా గోడ నిర్మాణం చేపట్టారని నిర్వాహకులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై చిరంజీవి సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆలయంలోని అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులు లోపలికి పోవడానికి ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన గోడను కొంత మేరకు తొలగించారు. ఈ సందర్భంగా ఆలయం చైర్మన్ ద్యావనపల్లి రాజారామ్ మాట్లాడుతూ త్రిశక్తి ఆలయం ముందున్న ఖాళీ స్థలం అన్ని దేవాలయాలకు సంబంధించిందని, ఉదయం ఆలయానికి వచ్చి చూసేసరికి తూర్పు దిక్కున ముఖద్వారానికి అడ్డుగా గోడ నిర్మించి ఉందన్నారు. దీంతో వెంటనే స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్, పోలీసులకు సమాచారం అందించామన్నారు. ఎస్సై సంఘటన స్థలం పరిశీలించి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం నిర్మించిన గోడను తొలగించారు. అక్రమంగా గోడ నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు ఆలయం చైర్మన్ తెలిపారు.

ఆవును వధించిన నిందితుల రిమాండ్

● వివరాలు వెల్లడించిన ఏసీపీ జీవన్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

శంకరపట్నం, జనవరి 3: శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామానికి చెందిన గాజుల పద్మ ఆవును పశువుల కొట్టంలో నుంచి తీసుకెళ్లి వధించిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ జీవన్‌రెడ్డి విలేకరులకు వివరాలు వెల్లడించారు. మొలంగూర్‌కు చెందిన గాజుల పద్మ ఈ నెల 1న సాయంత్రం ఆవును పశువుల కొట్టంలో కట్టేసి తెల్లవారు జామున చూడగా ఆవు కనిపించడం లేదని పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోష్‌కుమార్, ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం సాయంత్రం ఎండీ ఇజాజ్ బేగ్ అలియాస్ సద్దాం, షేక్ తాజ్, మొరె మనోజ్ అనే ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి విచారించారు. ఈ ముగ్గురు వ్యక్తులు గాజుల పద్మ ఆవును దొంగిలించి కోసి మాంసం విక్రయించినట్లు తెలిపారు. మాంసం విక్రయించగా వచ్చిన డబ్బులు రూ.5వేలు, గోవును వధించడానికి వాడిన ఆయుధాలు, ఒక బైక్‌ను వారి వద్ద నుంచి రికవరీ చేసుకున్నట్లు పేర్కొన్నారు. ముగ్గురు నిందితులను మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. జ్యుడీషియల్ రిమాండ్ కోసం హుజూరాబాద్ సబ్‌జైలుకు తరలించారు. గోవధ చట్టరీత్యా నిషేధం ఎవరైనా గోహత్య చేసినా, ట్రాన్స్‌పోర్ట్ చేసినా వారికి సహకరించినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ జీవన్‌రెడ్డి అన్నారు. 12గంటల్లోపు కేసు ఛేదించి నిందితులను అరెస్టు చేసిన హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోష్‌కుమార్, ఎస్ఐ లక్ష్మారెడ్డితో పాటు సిబ్బందిని ఏసీపీ జీవన్‌రెడ్డి అభినందించారు.

విద్యుత్ మోటార్ల దొంగలను పట్టుకున్న రైతులు


నిందితులను విచారిస్తున్న పోలీసులు

జగిత్యాల రూరల్, జనవరి 3: మండలంలోని పలు గ్రామాల్లో దొంగల ముఠా వరుసగా విద్యుత్ మోటార్లను చోరీ చేస్తూ రైతులకు కంటిమీద కునుకులేకుండా చేసింది. దీనిపై 20 రోజుల క్రితం జగిత్యాల రూరల్ స్టేషన్‌లో రైతులు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసినా దొంగల ఆచూకీ దొరకలేదు. దీంతో రైతులు అప్రమత్తమై దొంగలను కనిపెట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో బుధవారం జగిత్యాల మండలంలోని మోతె బైపాస్ నల్లగుట్ట శివారులో ఉదయం ఐదు గంటల సమయంలో ఓ రైతు పొలంలో విద్యుత్ మోటార్‌ను ఎత్తుకెళ్తుండగా రైతులు దొంగలను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్, లక్ష్మీపూర్, పొలాస, తిమ్మాపూర్ శివారుల్లో వరుసగా లక్షల విలువ చేసే మోటార్లు ఎత్తుకెళ్లడంతో పంటపొలాలు ఎండిపోయి, రైతులు ఆర్థికంగా నష్టపోయారు. దీంతో రైతులు తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టకేలకు దొంగల ఆచూకీని కనిపెట్టి పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకున్న జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్, ఎస్సై సదాకర్ ముగ్గురు విద్యుత్ మోటార్ల దొంగలను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

జగిత్యాల మండలంలోని మోతె బైపాస్ శివారులో ఓ రైతుకు చెందిన పొలంలో విద్యుత్ మోటార్‌ను ఎత్తుకెళ్లడానికి ప్రయత్నిస్తున్న దొంగలను రైతులు పట్టుకొని జగిత్యాల రూరల్ పోలీసులకు అప్పగించారు. వీరిలో బోధన్ ప్రాంతానికి చెందిన ఒకరు, జగిత్యాల జిల్లా కేంద్రంలోని జంబిగద్దె ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులుగా పోలీసులు అనుమానిస్తున్నారు.

సోషల్‌మీడియా వినియోగంపై అవగాహన

మల్యాల, జనవరి 3: సోషల్‌మీడియా వినియోగం-నియంత్రణపై మల్యాల పోలీసులు తాటిపల్లి బాలికల గురుకుల విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. దైనందిక జీవితంలో భాగమైన సోషల్‌మీడియాను నియంత్రణగా వినియోగించాలని తమ వ్యక్తిగత వివరాలు ఇతరులకు షేర్ చేయవద్దని మల్యాల ఎస్సై-2 కుమారస్వామి వివరించారు. డీపీలు, యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రిన్సిపాల్ పత్తెం శ్రీనివాస్, పశాంత్‌కుమార్, బాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, రమేష్, కార్తీక్, శివజ్యోతి, మానస తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులను అభినందించిన డీఈవో

జగిత్యాల అర్బన్, జనవరి 3: పట్టణంలోని జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీకి చెందిన 8వ తరగతి విద్యార్థిని సంజన ఇటీవలే ఎస్‌జీఎఫ్ పోటీల్లో రజత పథకం సాధించగా, ఈ నెల 8 నుంచి 12 తేదీల్లో రాజస్థాన్‌లో జరిగే 67వ ఎస్‌జీఎఫ్ అండర్ 14 జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ బియాల హరిచరణ్ రావు తెలిపారు. అలాగే పాఠశాలకు చెందిన 8వ తరగతికి చెందిన సాత్విక్ అనే మరో విద్యార్థి కేరళ రాష్ట్రంలో కోజికోడ్‌లో జరిగిన జాతీయ స్థాయి జూనియర్ సాఫ్ట్‌బేస్ బాల్ పోటీల్లో రజత పథకం సాధించాడు. ఈ సందర్భంగా క్రీడల్లో ప్రతిభ కనబర్చిన జ్యోతి పాఠశాలకు చెందిన క్రీడాకారులను జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి విద్యార్థులను అభినందించి, శుబాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్‌లు శ్రీధర్‌రావు, మౌనికరావు, అజిత, రజిత, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ లక్ష్మీరామ్ నాయక్, పీఈటీలు గౌతమ్, సుభాష్, నిఖిల్ తదితరులు ఉన్నారు.

ఈ నెల 11న కవి సమ్మేళనం

జగిత్యాల అర్బన్, జనవరి 3: కళాశ్రీ సాహితీ వేదిక, జగిత్యాల వారి ఆధ్వర్యంలో అలిశెట్టి ప్రభాకర్ యాదిలో రాష్ట్ర స్థాయి పురస్కారాలు, కవి సమ్మేళనం ఈనెల 11న నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు గుండేటి రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కవి సమ్మేళనంలో పాల్గొనేవారు జనవరి 7 తేదిలోపు నమోదు చేసుకోవాలని కోరారు. అలిశెట్టి కవిత్వం, జీవితం అనే అంశంపై ఈ కవి సమ్మేళనం ఉంటుందన్నారు.

మొక్కులు చెల్లించుకున్న అడ్లూరి అభిమానులు

గొల్లపల్లి, జనవరి 3: ఎమ్మెల్యేగా లక్ష్మణ్‌కుమార్ విజయం సాధించడాన్ని పురస్కరించుకునిమండలంలోని శ్రీరాములపల్లెలోని బీరప్ప, చౌడాలమ్మ ఆలయాల్లో ఆయన అభిమానులు బుధవారం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా తమ అభిమాన నాయకుడు గెలు పొందడం తమకు ఆనందంగా ఉందని, ఆయన భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లంబ ధనవ్వ లక్ష్మణ్, వార్డు సభ్యులు పురపాటి రాజరెడ్డి, గొల్లపల్లి ఆదర్శ పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ రేవెల్ల హన్మాండ్లు, నాయకులు గడ్డం మల్లయ్య, మోత్కు మల్లయ్య, పొన్నం రఘుపతి, బొమ్మ దొంగ మల్లయ్య పాల్గొన్నారు.

రేపు హుండీ లెక్కింపు

కొడిమ్యాల, జనవరి 3: మండలంలోని నల్లగొండ గ్రామ శివారులో ఎత్తైన గుట్టపై వెలసిన లక్ష్మీనర్సింహస్వామి వారి ఆలయ హుండీ లెక్కింపు ఈ నెల 5న శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మారుతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల భక్తులు, ప్రజలు ఉదయం పది గంటలకు ఆలయానికి రావాలిసిందిగా కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన ధర్మారం ఎంపీటీసీ సభ్యుడు



కాంగ్రెస్‌లో చేరిన ఎంపీటీసీ సభ్యుడు సుభాష్‌రెడ్డితో కాంగ్రెస్ నాయకులు

కోరుట్ల రూరల్, జనవరి 3: కోరుట్ల మండలం ధర్మారం గ్రామ బీఆర్ఎస్ ఎంపీటీసీ సభ్యుడు సుభాష్‌రెడ్డి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో బుధవారం చేరారు. కోరుట్ల పట్టణంలోని జువ్వాడి భవనంలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి సుభాష్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరగా జువ్వాడి సోదరులు కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాదాపూర్ ఎంపీటీసీ సభ్యుడు కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోయినిపల్లి సత్యం రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, నాయకులు కొంతం రాజం, రమేష్, లచ్చయ్య, మహిపాల్ రెడ్డి, నహీం తదితరులు పాల్గొన్నారు.

సొంతగూటికి చేరుకున్న కౌన్సిలర్

కోరుట్ల, జనవరి 3: పట్టణంలోని 25వ వార్డు కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం బీఆర్ఎస్ పార్టీని వదిలి కాంగ్రెస్ గూటికి బుధవారం చేరారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగి కౌన్సిలర్‌గా ఉన్న ఎంబేరి నాగభూషణం గత మున్సిపల్ ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ నుండి పోటీ చేసి 25వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందాడు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో పార్టీలో చేరడానికి కొంత మంది కౌన్సిలర్ ఆసక్తి చూపుతున్నారని వార్తలు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఎంబేరి నాగభూషణం తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సమక్షంలో పార్టీలో చేరారు. ఇది ఇలా ఉండగా బీఆర్ఎస్‌కు చెందిన కొంతమంది కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ముఖ్య నాయకులతో మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి రూరల్, జనవరి 3: నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిషలు కృషి చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బుధవారం మండలంలోని రామరావుపల్లె గ్రామంలో రూ. 20లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, మండల నిధులు రూ. 3.18లక్షలతో పాఠశాల ప్రహరీ, మినీ ఫంక్షన్‌హాల్‌ను ఎంపీపీ మారు సాయిరెడ్డి, సర్పంచు ఏగుర్ల లక్ష్మి-రమేష్‌తో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత మొదటిసారిగా గ్రామానికి రాగా గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామస్థులు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచు పుప్పాల ప్రతాప్, కోఆప్షన్ సభ్యుడు మారుతిరెడ్డి, కొండ యుగేందర్, గడ్డం రాజారెడ్డి, మెండె రమేష్, పంచాయతీ పాలక వర్గం, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ ఇంద్రజాలికుడు రత్నాకర్ గౌడ్ మృతి

రాయికల్, జనవరి 3: పట్టణానికి చెందిన ప్రముఖ ఇంద్రజాలి కుడు బొల్లపల్లి రత్నాకర్ గౌడ్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. 25 సంవత్సరాలకు పైగా జానపద కళాకారునిగా, ఇంద్రజాలికుడిగా తెలుగు రాష్ట్రాల్లో అందరికీ సుపరిచితుడు. ఉపాధ్యాయునిగా ప్రైవేట్ పాఠశాలలో బోధించిన రత్నాకర్ జానపదాలు, ఇంద్రజాలికుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. పలు రాష్ట్ర స్థాయి అవార్డులు సైతం పొందాడు. బుల్లితెర నటులతో అనేక కార్యక్రమాలు నిర్వహించిన ఆయన అనారోగ్యం, ఆర్థిక పరిస్థితులతో చాలా ఇబ్బందులు పడ్డాడు. బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందడంతో జిల్లాలోని పలువురు కళాకారులు, ఇంద్రజాలికులు, నాయకులు తమ సంతాపం వ్యక్తం చేశారు.

అనారోగ్యంతో మృతి చెందిన ఇంద్రజాలికుడు రత్నాకర్ మృతి చెందడంతో రాయికల్ జర్నలిస్ట్ జేఏసీ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఆయన మరణం తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల జగదీశ్వర్, ఉపాధ్యక్షుడు చింతకుంట సాయి కుమార్, సంయుక్త కార్యదర్శి గంగాధరి సురేష్, సభ్యులు పాల్గొన్నారు.

‘ప్రజాపాలన’కు 48,696 దరఖాస్తులు

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర





చిన్నమెట్‌పల్లిలో దరఖాస్తులను అధికారులకు అందజేస్తున్న జువ్వాడి నర్సింగరావు, అల్లీపూర్‌లో దరఖాస్తు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

జగిత్యాల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు గ్రామపంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో బుధవారం అయిదో రోజు నిర్వహించిన ప్రజాపాలన వార్డు, గ్రామసభల్లో 48,696 దరఖాస్తులు వచ్చాయని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర, జిల్లా ప్రజాపాలన నోడల్ ఆఫీసర్, డీపీవో దేవరాజ్ తెలిపారు. జిల్లాలో 57 గ్రామ పంచాయతీలు, 134 మున్సిపల్ వార్డులలో సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. గ్రామపంచాయతీల పరిదిలో 38,943 దరఖాస్తులు, మున్సిపల్ వార్డుల పరిధిలో 9,753 దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించినట్లు ప్రకటించారు. ఇప్పటివరకు జిల్లాలో 2,32,187 దరఖాస్తులు రాగా ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 1,75,255, పట్టణ ప్రాంతాల్లో 56,932 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

● కొనసాగిన దరఖాస్తుల స్వీకరణ

రాయికల్: రాయికల్ పట్టణంలోని మూడో వార్డులో ప్రజాపాలన కార్యక్రమాన్ని బుధవారం అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అలాగే మండలంలోని అలియా నాయక్ తండా, అల్లీపూర్, మైతాపూర్, భూపతిపూర్, ఇటిక్యాల గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. మండలంలోని అల్లీపూర్ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల కేంద్రాన్ని జగిత్యాల ఆర్డీవో నరసింహా మూర్తి పరిశీలించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, కౌన్సిలర్లు సాయి కుమార్, మ్యాకల అనురాధ, ప్రత్యేకాధికారి దేవేందర్ రెడ్డి, తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీపీ సంధ్యారాణి, సర్పంచ్ నందు, ఎంపీడీవో సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఆల్యానాయక్ తండాలో బుధవారం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో పలు తండాలవాసులు ఆందోళన చేపట్టారు. తమ తండాకు సమీపంలోని గ్రామ పంచాయతీ భవనంలో కాకుండా దూరంగా ఉన్న ప్రైవేట్ భవనంలో కార్యక్రమాన్ని చేపట్టడంతో ఆందోళన చేశారు. అనంతరం అధికారులు స్పందించి గ్రామపంచాయతీలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంతో వివాదం సద్దుమణిగింది.

గొల్లపల్లి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని ప్రజాపాలన ప్రత్యేకాధికారి సాయిబాబా అన్నారు. మండలంలోని వెంగళాపూర్, రంగదాముని పల్లె, బీబీరాజ్‌పల్లె, గుంజపడుగు గ్రామాల్లో అధికారులు బుధవారం ప్రజాపరిపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ ఇప్పటివరకు 20 గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించగా 9,291 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమాల్లో సర్పంచులు పెంచాల వసంతతిరుపతి, కొత్తూరు సరితరవీందర్, గుండ రమ్య, తహసీల్దార్ మహ్మద్ ఆరిఫొద్దీన్, ట్రాన్స్‌కో ఏఈ దివాకర్‌రావు పాల్గొన్నారు.

సారంగాపూర్: ప్రజాపాలన కార్యక్రమంలో బాగంగా ఆరు గ్యారెంటీ పథకాలకు అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రమేష్ తెలిపారు. మండలంలోని బట్టపెల్లి, పోచంపేటలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి హాజరై దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్‌లు బాస్కర్‌రావు, క్రిష్ణ, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పెగడపల్లి: అభయహస్తం ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రజాపాలనలో ప్రతి ఒక్కరి దరఖాస్తు స్వీకరిస్తామని పెగడపల్లి మండల ప్రత్యేకాధికారి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వేణుగోపాల్‌రావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఎల్లాపూర్, ఆరవెల్లి, లింగాపూర్ గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించి అభయహస్తం ఆరు గ్యారంటీల అమలుకు గాను దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచులు, ఎంపీటీసీలు ముద్దం అంజమ్మ మల్లేశం, ఉప్పులంచ లక్ష్మణ్, పూసాల శోభాతిరుపతి, కొత్తపల్లి రవీందర్, గంగారెడ్డి, ఎంపీడీవో పుల్లయ్య, తహసీల్దార్ ఫారూక్, ఎంపీవో మహేందర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వెల్గటూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని తహసీల్దార్‌లు శేఖర్, ఉదయ్‌కుమార్, ఎంపీడీవో సంజీవ్‌రావు కోరారు. బుధవారం ఉమ్మడి వెల్గటూర్ మండలంలోని శాఖాపూర్, పాషిగామ, కప్పారావుపేట, రాంనూర్, మారేడుపల్లి గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అభయహస్తం దరఖాస్తులు స్వీకరించారు. ఐదు గ్రామాల్లో 1,067 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో భూమయ్య, ఎంపీవో శ్రీనివాస్, సర్పంచ్‌లు రవి, తిరుపతి, నీల, బోడుక మంజుల, ఎంపీటీసీలు, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కొడిమ్యాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తులను ఐదోరోజు బుధవారం మండలంలోని డబ్బుతిమ్మయ్యపల్లి 410 దరఖాస్తులు, శ్రీరాములపల్లి, 342 దరఖాస్తులు, కోనాపూర్ 393 దరఖాస్తులు రాగా దరఖాస్తులను ప్రత్యేక అధికారులు ఎంపీడీవో పద్మజారాణి, తహసీల్దార్ రవికాంత్, ఏఈఈ మణిదీప్ ఆధ్వర్యంలో సిబ్బంది స్వీకరించారు. ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాలను డీఎల్‌పీవో శంకర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ రవి, ఆయా గ్రామాల సర్పంచులు రాధగౌతంరెడ్డి, శ్రీనివాసరెడ్డి, స్వామిరెడ్డి, ఎంపీవో ప్రవీణ్, సీనియర్ అసిస్టెంట్ సురేష్, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మపురి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ధర్మపురి మండల ప్రత్యేక అధికారి ఎండీ రహమాన్ కోరారు. ధర్మపురి మండలంలోని తీగలధర్మారం, కొసునూర్‌పల్లె, మగ్గిడి-ఎడపల్లి, రామయ్యపల్లె గ్రామాల్లో, ధర్మపురి పట్టణంలోని 7, 9వ వార్డుల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ రమేష్ దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణచైతన్య, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, పీఆర్ ఏఈఈ ముకరం, ఎంపీవో నరేష్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బీర్‌పూర్: మండలంలోని తాళ్ళధర్మారం, రేకులపెల్లి గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తులను తహసీల్దార్ నరేష్, ఎంపీవో రామకృష్ణ రాజు స్వీకరించి రసీదులు అందించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, సర్పంచ్‌లు నల్ల మహిపాల్ రెడ్డి, ఎలగందుల లక్ష్మీ అశోక్ పాల్గొన్నారు.

ఎండపల్లి: మండలంలోని మారేడుపల్లిలో ప్రజాపాలనా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం చేపట్టారు. మొత్తం 457 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో లలిత, సర్పంచ్ లక్ష్మీనారాయణ, బాలసాని మల్లేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సింగరావు అన్నారు. బుధవారం మండలంలోని చిన్నమెట్‌పల్లిలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ సభను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో శ్రీనివాస్, మాజీసర్పంచ్ నర్సయ్య, మాదాపూర్ ఎంపీటీసీ సభ్యుడు కృష్ణారెడ్డి నాయకులు కొంతం రాజం, నసీర్ పాల్గొన్నారు.

● అర్హులందరి దరఖాస్తులు స్వీకరించాలి: కలెక్టర్

జగిత్యాల రూరల్: అర్హులైన ప్రజలు ఏఒక్కరు తప్పిపోకుండా ప్రజాపాలన కార్యక్రమం కింద దరఖాస్తులు స్వీకరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆదేశించారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలంలోని అనంతారం, తక్కళ్లపల్లి గ్రామాల్లో కలెక్టర్ పర్యటించి ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐదు గ్యారంటీల దరఖాస్తుల ఫారంలో వివరాలు సరిగ్గా నమోదు చేశారో లేదో చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. దరఖాస్తులను అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వమే సరాఫరా చేస్తుందని తెలిపారు. దరఖాస్తుల ఫారాలను అమ్మేవారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు ప్రజాపాలనపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి దేవరాజు, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో రవిబాబు, అనంతారం సర్పంచ్ జంగ జలందర్, ఉపసర్పంచ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



అనంతారంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్

తప్పులు లేకుండా దరఖాస్తు చేసుకోవాలి

మెట్‌పల్లి రూరల్, జనవరి, 3: ప్రజలు అభయహస్తం ఫారంలోని సందేహాలను అధికారులను అడిగి తెలుసుకొని తప్పులు దొర్లకుండా దరఖాస్తులు చేసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండలంలోని చింతలపేట, కోండ్రికర్ల, మెట్లచిట్టాపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో తీసుకుంటున్న జాగ్రత్తలు ఇతర విషయాలను ఎంపీపీ మారు సాయిరెడ్డితో కలిసి బుధవారం పరిశీలించారు. దరఖాస్తులు చేసుకునే వారికి ఫారం అందజేసి నింపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కావలసిన ప్రజాపాలన దరఖాస్తులు అందుబాటులో ఉంచాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణరావు, కొమిరెడ్డి కరంచంద్, అల్లూరి మహేందర్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచులు బద్దం శేఖర్‌రెడ్డి, మ్యాకల అర్చన-సుదర్శన్, ఎంపీడీవో భీమేశ్‌రెడ్డి, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, నాయకులు గడ్డం రాజారెడ్డి, మెండె రమేష్, అధికారులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల, జనవరి 3: ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌ను బుధవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు జిల్లా కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌ను నర్సింగరావు పుష్పగుచ్ఛంను అందించి సన్మానించారు.

‘భట్టి’ని కలిసిన రైతు ఐక్యవేదిక అధ్యక్షుడు

కోరుట్ల, జనవరి 3: ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాదులోని సెక్రటేరియట్‌లోని మినిస్టర్ చాంబర్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి స్థానిక సమస్యలను తెలిపినట్లు వివరించారు. ఈ ప్రాంతంలో పర్యటించి రైతుల సమస్యలను పరిష్కరించాలని విన్నవించినట్లు నర్సారెడ్డి తెలిపారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి





నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్, మల్యాలలో నివాళులు అర్పిస్తున్న యువకులు

జగిత్యాల అర్బన్, జనవరి 3: సామాజిక సేవకురాలు, దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని, మహిళా అక్షరాభ్యసం కోసం ఆమె చేసిన సేవ చిరస్మరణీయం అని టీబీసీ జేఏసీ సంఘ అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో జిల్లా టీబీసీ జేఏసీ సంఘ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 193వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రి భాయి పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. పీడీత ప్రజలకు, మహిళలకు అక్షర జ్ఞానం నేర్పిన పూలే జీవితం ఆదర్శనీయం అన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు బండారి విజయ్, సింగం భాస్కర్, శివ ప్రసాద్, గంగాధర్, శ్రీమంజరి, భూమాచారి తదితరులున్నారు.

- జిల్లా గ్రంథాలయంలో సామాజిక సేవకురాలు సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ చైర్మెన్ డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్ హాజరై, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శనీయం అన్నారు.

ధర్మపురి: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో, మండలంలోని ఆరెపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో వేర్వేరుగా నిర్వహించిన వేడుకల్లో భాగంగా న్యాయవాదులు, ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బెజ్జంకి నితిన్‌కుమార్, బార్ అసోసియేషన్ సభ్యులు న్యాయవాదులు గడ్డం లింగారెడ్డి, జాజాల రమేష్, రౌతు రాజేష్, టీచర్లు మ్యాన పవన్‌కుమార్, సరోజ, చామంతి, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: మల్యాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను మండల ముదిరాజ్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం మల్యాలలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులను సంఘ అధ్యక్షుడు దొంతరవేణి శేఖర్ అందజేశారు. కార్యక్రమంలో బొజ్జ నర్సయ్య, కీసరి గణేష్, అలంకార్, బెజ్జంకి చిన్నదుర్గయ్య, మారంపల్లి లక్ష్మన్, మునుగురి నివాస్, త్రినాథ్, గుడిసె రవి, పన్నాటి మల్లేశం, సంజీవ్, రంజిత్, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు

రాయికల్: మండలంలోని తాట్లవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకల్లో ప్రధానోపాధ్యాయుడు బోగ రమేష్ మాట్లాడుతూ సమాజంలోని కట్టుబాట్లు, ఆచార వ్యవహారాల వలన స్త్రీలు విద్యకు దూరంగా ఉండటం, కుల వివక్ష, అంటరానితనం వంటి సామాజిక రుగ్మతలపై సావిత్రిబాయి పూలే పోరాటం చేశారని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, లావణ్య, సాగరిక, శ్రీధర్, చంద్రకళ, రవికుమార్, పరమేశ్వర్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని సావిత్రిబాయి పూలే విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు నల్ల వెంకటేశ్వర్లు, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల లింబాద్రి, మైలారం లింబాద్రి, కాంగ్రెస్ నాయకులు జెట్టి లింగం, తుమ్మనపల్లి రాంప్రసాద్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని పూలే అంబేద్కర్ నగర్‌లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను సీపీఎం నాయకులు, మహిళలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తిరుపతి నాయక్, నాయకులు తస్వీర్ లతిక తదితరులు పలువురు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు, మండలంలోని రాఘవుపేట గ్రామంలో సావిత్రి బాయ్ పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మల్లాపూర్‌లోని పాఠశాలలోని విద్యార్థులకు మల్లాపూర్ ఎస్సై నవీన్‌కుమార్ సైబర్ నేరాల గురించి, దురలవాట్ల నేర్చుకుంటే వాటిల్లే నష్టం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పురుషోత్తం, వెంకటరమణ, బధుబాబు, శ్రీనివాస్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎండపల్లి: మండలంలోని గుల్లకోటలో జనం కోసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల కోచింగ్ సెంటర్‌లో కోచింగ్ నిర్వాహకుడు లింగంపల్లి చందు ఆధ్వర్యంలో సావిత్రి భాయిపూలే జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని తక్కళ్ళపల్లిలోని గ్రామ పంచాయితీ భవన సమీపంలో పూలే చిత్ర పటానికి గ్రామస్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మొలిగే శ్రీనివాస్, కోట శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా శ్రీరాముడి అక్షింతలు పంపిణీ



మెట్‌పల్లిలో అయోధ్య రాముని అక్షింతలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ధర్మపురి, జనవరి 3: ధర్మపురి పట్టణంలోని పలు వీధుల్లో శ్రీరాముని అక్షింతలను ఇంటింటా బుధవారం పంపిణీ చేశారు. రామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు అయోధ్యలో అభిషేకంలో పూజించిన అక్షంతల వితరణ కార్యక్ర మంలో భాగంగా మొదట హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని వార్డుల్లో ఇంటింటా తిరుగుచూ శ్రీరాముని అక్షింతలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు, వీహెచ్‌పీ నేతలు సంగి నర్సయ్య, బండారి లక్ష్మణ్, పిల్లి శ్రీనివాస్, తిరుమన్‌దాసు సత్యనారాయణ, ఆకుల శ్రీనివాస్, దుర్గప్రసాద్, చుక్క భీమరాజు, చల్ల రవి, కాశెట్టి విజయ్, సోమిశెట్టి శివసాయి, ఆసం సురేష్ పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మల్లన్నపేట మల్లికార్జున స్వామి ఆలయానికి అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన అక్షింతలు బుధవారం చేరుకున్నాయి. విశ్వహిందూపరిషత్ మండల అధ్యక్షుడు కుంబార్‌కా ర్ అరుణ్, ఆలయ కమిటీ సభ్యులు మంగళహారతులతో ఆహ్వానించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ గౌరవ అధ్యక్షుడు తిరునహరి సత్యనారాయ ణ, అంకం సతీష్, భీమ మహేష్, అవారి చందు, బండి విజయ్, ఆలయ కమిటీ చైర్మన్ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: శ్రీరామ జన్మ భూమి అయోధ్యలో పూజింపబడిన అక్షింతలతో బుధవారం మెట్‌పల్లి పట్టణంలో శోభాయాత్రను నిర్వహించారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో రాముల వారి అక్షింతలను చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామి వారి వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజలు జరిపి రామ భజన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం పట్టణంలోని చైతన్య నగర్ కాలనీ వీధుల గుండా శోతిభాయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక రథంలో సీతారాముల పూజింప బడిన ఫొటోలు ఏర్పాటు చేసి శ్రీరామ జన్మభూమి అయోధ్య నందు పూజింపబడిన అక్షింతలను భక్తులు నెత్తిన ఎత్తుకొని రామనామం జపంతో శోభాయాత్రగా బయలుదేరారు. శోభాయాత్రలో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి కోలాటాలు, నృత్యాలు చేసుకుంటూ, భజనలు చేస్తూ ఆలయానికి తీసుకొచ్చారు. పురోహితులు వేదమంత్రత్సోల మధ్య ప్రత్యేక పూజలు జరిపారు. జనవరి 22న అయోధ్యలో సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠపన మహోత్సవం వైభవంగా జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశోకతీర్థ స్వామి, పొహార్ తుకారాం, మామిడాల కళ్యాణ్, మట్కి భాస్కర్, ఇల్లెందుల శ్రీనివాస్, మైలారం లింబాద్రి, రాంబాబు, రాజశేఖర్, వడ్డేపల్లి చిన్నయ్య, అడ్డగట్ల నర్సయ్య, అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని కాలేజీ గౌండ్ ప్రాంతంలోని దుర్గా దేవాలయంలో అయోధ్యలో నిర్మాణమవుతున్న రామమందిర అక్షింతలకు ప్రత్యేక పూజలను నిర్వహించి ఇంటింటికి పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. వార్డు కౌన్సిలర్ పెండం గణేష్ ఆధ్వర్యంలో బీజేపీ, బీజేవైఎం మహిళా మోర్చా సభ్యుల ఆధ్వర్యంలో ఇంటింటికి అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కొత్త శోభారాణి, దగ్గుల పరమేశ్వరి, కొక్కుల సుమ, కొక్కుల త్రివేణీ, మిట్టపల్లి సరస్వతి, పిల్లమారి పద్మ, గోనె అనురాధ, ఎలిగెట్టి స్రవంతి, ఉరడి మమతా, పెండం స్వాతి, మచ్చ సుజాత పాల్గొన్నారు.

‘విశ్వసనీయత లేని ప్రజాపాలన’

మల్యాల, జనవరి 3: ప్రజాపాలన ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ గందరగోళంగా మారిందని దానిపై ప్రజలకు విశ్వసనీయత లేకుండా పోతుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు అన్నారు. మల్యాలలో ఆయన మండల శాఖ అధ్యక్షుడు నెరెళ్ల శ్రావణ్, తాటి పల్లి సర్పంచ్ జ్యోత్స్నలతో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా మొదట్లో రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు సరిపోతాయని చెప్పి మళ్లీ ఇప్పుడు ఆరు గ్యారంటీలకు సంబంధించిన పత్రాలు జత చేయాలనడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. పిల్లి రాజశేఖర్, కట్కం లత, గాజుల మల్లేశం, బండారి రాజు, సంకుర్తి వేణు ఉన్నారు

రెడ్డి సంఘం అధ్యక్షుడిగా రాంరెడ్డి

కొడిమ్యాల, జనవరి 3: మండలంలోని అప్పారావుపేట గ్రామ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా గుడిపెల్లి రాంరెడ్డిని సభ్యులు బుధవారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా మోతె మల్లారెడ్డి, బండ రాజిరెడ్డి, కోశాధికారిగా రేకులపల్లి మల్లారెడ్డి, సహాయ కార్యదర్శిగా రేకులపల్లి ధర్మారెడ్డి, కార్యదర్శిగా గుర్రాల సత్యనారాయణరెడ్డిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు మల్లేశం ముదిరాజు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు బొమ్మల వితరణ

కొడిమ్యాల, జనవరి 3: మండలంలోని పూడూర్ లోగల నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలకు సుమారు 10 వేల రూపాయల విలువైన బొమ్మలను బుధవారం అదే గ్రామానికి చెందిన ప్రీ స్కూ ల్ అబ్బాయి తండ్రి ఏగుర్ల గణేష్ అందించాడు. కార్యక్ర మంలో మల్యాల ఐసీడీఎస్ సీడీపీవో నర్సింగరాణి, సూపర్‌వైజర్ సుదారాణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.